ప్రజాశక్తి
మంగళవారం 10 జనవరి 2023
5
శ్రీకాకుళం

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రాజెక్టు టిల్ కార్యక్రమంలో భాగంగా కేన్సర్‌పై అవగాహన పోస్టర్‌ను జెడ్‌పిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు యోగా, ధ్యానం వంటి పద్ధతులను అలవరుచుకోవాలన్నారు. వైద్యాధికారులు కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర డెమో అసోసియేషన్ ముద్రించిన ఉద్యోగుల కేలండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డెమో పైడి వెంకటరమణ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జల్ జీవన్... జాప్యమయ్యేను

- జిల్లాలో 3,22,558 కుళాయిల ఏర్పాటు
- టెండరు దశలోనే 1424 పనులు
- ఇప్పటికీ 83 పనులు గ్రౌండింగ్ కాని వైనం
- 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవస్థలకు చెక్ చెప్పడం, ప్రతి వ్యక్తికి 55 లీటర్ల సురక్షితమైన తాగునీటిని అందించాలన్నది జల్ జీవన్ మిషన్ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా గ్రామంలోని అన్ని కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. స్థానికంగా తాగునీటి వనరుల లభ్యత, అవసరమైనచోట అదనపు బోర్లు, ట్యాంకులు, పైపులైన్లు నిర్మించి తాగునీటి సమస్యను అధిగమించడం ప్రధాన కర్తవ్యం. నాలుగేళ్ల కాలపరిమితితో ప్రారంభించిన పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. 2024 నాటికి పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్దేశించాయి. ఐదేళ్ల కాల పరిమితితో మెటీరియల్ కొరత, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 3,22,558 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 2021-22 సంవత్సరంలో 1,02,277 కనెక్షన్లకు సంబంధించి పనులు ప్రారంభించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 52,303 పనులు ప్రారంభించాల్సి ఉండగా, 39,520 కనెక్షన్లకు సంబంధించిన పనులకు ఆమోదం లభించింది. ఇంకా 12,788 పనులను ఈ ఏడాది డిసెంబరు లోగా పనులు ప్రారంభించాల్సి ఉంది. పనులను 2,284 ఆవాసాల్లో చేపట్టేందుకు కార్యాచరణను రూపొందించారు. ఇందులో పాత పథకాలను కొంతమేర సర్దుబాటు చేయడం ద్వారా 622 పనులు, కొత్తగా 1662 రకాల పనులు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికీ ఉన్న పథకాలకు రూ.107.75 కోట్లను వెచ్చిస్తే 622 రకాల పనులు పూర్తి చేయొచ్చని అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా కొత్తగా చేపట్టనున్న 1662 పథకాలకు రూ.336.55 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. 622 రకాల పనుల్లో ఇప్పటివరకు 135 పనులు పూర్తయ్యాయి. 241 పనులు ప్రగతిలో ఉన్నాయి. నేటికీ 66 పనులు గ్రౌండింగ్ కాలేదు. 38 పనులు టెండరు ప్రక్రియ దశలో ఉన్నాయి. ఇందుకోసం ఇప్పటివరకు రూ.18.84 కోట్లను ఖర్చు చేశారు. కొత్తగా చేపట్టాలని నిర్ణయించిన 1662 పనుల్లో ఇప్పటివరకు కేవలం రెండు పనులు మాత్రమే పూర్తయ్యాయి. 257 పనులు ప్రగతిలో ఉండగా 17 పనులు ఇప్పటికీ గ్రౌండింగ్ కాలేదు. 1386 పనులు ఇంకా టెండరు దశలోనే ఉన్నాయి. ఇప్పటివరకు రూ.29.82 లక్షలను వెచ్చించారు.

రెండు కేటగిరీలుగా పనులు

జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే పనులను రెండు కేటగిరీలుగా విభజించారు. రూ.పది లక్షలోపు పనులను ఒక కేటగిరీగా, ఆపై ఖర్చు దాటిన పనులను రెండో కేటగిరీగా వర్గీకరించారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 255 పనులను రూ.7.79 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. వీటిలో ఇప్పటివరకు 227 పనులు పూర్తయ్యాయి. 28 పనులు ఇంకా పూర్తి ప్రారంభం కాలేదు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 26 పనులు, నరసన్నపేటలో ఏనిమిది పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. 2029 పనులకు రూ.పది లక్షల పైబడి ఖర్చు వెచ్చించాల్సి ఉంటుందని గుర్తించి రూ.436.51 కోట్లు అవసరమని అంచనా వేశారు. వీటిలో ఇప్పటివరకు 122 పూర్తి కాగా, 466 పనులు ప్రగతిలో ఉన్నాయి. 1422 పనులు ఇంకా టెండరు దశలోనే ఉన్నాయి.

పనుల్లో కొరవడుతున్న నాణ్యత

జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న పనుల్లోనూ నాణ్యత కొరవడుతోంది. పలుచోట్ల వేసిన ట్యాప్‌లు సైతం విరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల కుళాయిలు ఏర్పాటు చేసినా, నీటి వసతిలేకపోవడంతో అవి అలంకారప్రాయంగానే మారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగానే జరుగుతున్నాయి.

జాప్యానికి కారణాలు ఇవే...

పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా, మొత్తం 2,284 పనుల్లో 1424 పనులు ఇంకా టెండరు దశలోనే ఉన్నాయి. 83 పనులు ఇంకా గ్రౌండింగ్ కూడా కాలేదు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒక్కో పనికి రెండు మూడు పర్యాయాలు పిలవాల్సి వస్తోందని అధికారులు చెప్తున్నారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో, కొన్నిచోట్ల టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అదీగాక సకాలంలో మెటీరియల్ రాకపోవడమూ మరో కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని జిల్లాల్లోనూ జల జీవన్ పనులు జరుగుతుండడంతో పైపులకు తీవ్ర డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

ధాన్యం కొనుగోలుకు కాలపరిమితి సరికాదు

రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - మందస

రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కాలపరిమితి విధించడం సరికాదని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల కార్యదర్శి ఎం.ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన రైతుసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల్లో నిర్దేశించిన తేమ శాతానికి మించి మిల్లర్లు అధికంగా చూపించి, బస్తాకు 5 నుంచి 7 కేజీల ధాన్యాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. అలా ఇవ్వడాన్ని నిరాకరించిన రైతుల ధాన్యాన్ని దించకుండా వెయిటింగ్ పేరుతో పెడుతున్నారని చెప్పారు. దీనివల్ల వెయిటింగ్ ఛార్జీ అదనంగా రైతులు చెల్లిస్తున్నారని తెలిపారు. రైతుల ధాన్యం అమ్ముడుపోక కళ్లాల్లోనే ఉంటుండడంతో, చాలామంది రైతులు నూర్పులు చేయడం లేదన్నారు. రైతుల పొలాల్లో పెసర, మినుము పంటలు వేయడంతో, ఆ పంటలు తీసిన తర్వాత నూర్పులు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి ధాన్యం లెవీ సేకరణను పూర్తి చేస్తామని సివిల్ సప్లయి కమిషనర్ చెప్పారని, ఆ తర్వాత మిగిలిన ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ప్రకటించిందని, అలాంటప్పుడు కాలపరిమితి విధించడం సరికాదన్నారు. అధికారులు వాస్తవ పరిస్థితిని గమనించి రైతుల వద్ద ఉన్న ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు టి.లక్ష్మీనారాయణ, ఎస్. జగ్గారావు, పి.దేవేంద్ర, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

నేడు వైద్యారోగ్యశాఖ మంత్రి రజని పర్యటన

ప్రజాశక్తి - పలాస, శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని పలాస నియోజకవర్గంలో మంగళవారం పర్యటించనున్నారు. ఈమేరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు మందస మండలం హరిపురంలో డయాలసిస్ కేంద్రాన్ని సందర్శిస్తారు. 10.30 గంటలకు లోహరిబందలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో సమావేశమవుతారు. 11.30 గంటలకు పలాసలో నిర్మాణంలో ఉన్న 200 పడకల మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. భోజన విరామం అనంతరం 2.30 గంటలకు పలాస నుంచి విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.

నేర నియంత్రణకు నిఘా కట్టుదిట్టం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నేర నియంత్రణకు నిఘాను కట్టుదిట్టం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్‌తో కలిసి క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సిబ్బంది వివరాలపై ఆరా తీసి సర్కిల్ వారీగా ఇన్‌ఛార్జి ఎస్‌ఐలుగా కొంతమందిని నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల ఛేదనలో నైపుణ్యాన్ని పెంచుకుని సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించాలన్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఎప్పటికప్పుడు పాత నేరస్తులపై నిఘా పెడుతూ వారి ఉనికిని కనిపెట్టాలన్నారు. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పండగ వేళలో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి స్థానిక పోలీసులను సమన్వయం చేసుకుంటూ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సిసి కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆలయాల్లో దొంగతనాలు, చైన్ స్నాచింగ్, ఆస్తి నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టి రాత్రివేళలో గస్తీలు నిర్వహించాలని తెలిపారు. ఇతర జిల్లాల్లో నేర తరహా విధానాలను తెలుసుకుంటూ జిల్లాలో వారి ఉనికి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. సంక్రాంతి పండగలో పేకాట, కోడి పందేలు జరగకుండా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సిఐలు జి.వి రమణ, బి.ప్రసాదరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'కు 141 వినతులు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 141 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఉప కలెక్టర్ జయదేవితో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులపై పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు రీ ఓపెన్ కాకుండా, నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుదారులకు శాశ్వత పరిష్కారం నిర్ణీత కాలవ్యవధిలో జరగాలని, అప్పుడే ప్రజలకు అధికారులపై నమ్మకం కలుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు సంబంధించి 61 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సత్వరం పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, డిపిఒ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఉపాధి పనులు పరిశీలన

పోలాకి : అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించి, ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు ఆదేశించారు. మండలంలోని కోడూరు పంచాయతీలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గరిష్ట కూలి రూ.250 వచ్చేలా కొలతల ప్రకారం పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీలో రోజుకు 300 మందికి తక్కువ కాకుండా పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడి యుగంధర్, ఇసి గోవిందరావు, టిఎలు సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

'జనం ప్రాణాలతో రాజకీయాలే అజెండా'

నరసన్నపేట : రోడ్ల మీద సభల వల్ల ప్రజల ప్రాణాలు పోయినా పట్టించుకోని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, అందుకు కారకుడైన చంద్రబాబుతో భేటీ కావడం వారి దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. పవన్‌కు రాజకీయ విజ్ఞత శూన్యమని పేర్కొన్నారు. కుప్పంలో జిఒ నంబరు 1ను పోలీస్ యంత్రాంగం అమలు చేయడానికి ప్రయత్నిస్తే, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు దానిపై మీడియా ముందు నటిస్తే అతని దత్త పుత్రుడు ఓవర్ యాక్షన్ చేయడానికి సిద్ధమైపోయారని ఎద్దేవా చేశారు.

టోల్‌ప్లాజా కార్మికులను సర్దుబాటు చేయాలి

జెడ్‌పి ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేయాలని, లేకుంటే గ్రాట్యుటీ, తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని జెడ్‌పి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేసిన కారణంగా నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో టోల్ రుసుమును పెంచి ఆదాయం తగ్గకుండా సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు రోడ్డున పడిన కార్మికులను విస్మరించడం తగదన్నారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు కాని పక్షంలో కార్మికులకు గ్రాట్యుటీ, తగిన పరిహారం చెల్లించాలన్నారు. తక్షణమే యూనియన్‌తో చర్చలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నేషనల్ హైవే అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న నేషనల్ హైవే అధికారులు కార్మికులను గ్రాట్యూటీ, పరిహారం చెల్లించకుండా రోడ్డున పడేసినా పట్టించుకోకపోవడం ఆందోళనకరమన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మికులపై అనుసరిస్తున్న దుర్మార్గపు వైఖరికి నిదర్శనమన్నారు. దేశ రక్షణ రంగంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జవాన్లకు బిజెపి ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హైవే పీడీని పలుమార్లు కలిసి విన్నవించినా కార్మికుల సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. అనంతరం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ కేంద్ర కార్మికశాఖ అధికారుల నుంచి ఎన్‌హెచ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వచ్చేలా డిసిఎల్ చర్యలు తీసుకోవాలని... యూనియన్, నేషనల్ హైవే అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి నర్సింహులు, నాయకులు ఎం.శంకరనారాయణ, ఎ.వి.ఆర్.మూర్తి, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

కిడ్నీ రోగులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట

కిడ్నీ రోగులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. పలాస మండలంలోని గొల్లమాకన్నపల్లిలో కిడ్నీ రోగులతో సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి పిహెచ్‌సిలో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. ప్రభుత్వం కొంతమందికే పింఛన్లు ఇవ్వడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సహాయం కేవలం రవాణా ఖర్చులు, మందులకే సరిపోతున్నాయన్నారు. మంత్రి అప్పలరాజు మూడు రాజధానుల కోసం మాట్లాడుతున్నారు తప్ప నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించడం లేదని విమర్శించారు. అనంతరం కిడ్నీ రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జగన్‌ను సాగనంపడానికి జన సైనికులు ఇప్పట్నుంచే కష్టపడాలని మనోహర్ పిలుపునిచ్చారు. రెండేళ్ల కిందట ఎచ్చెర్లలోని ఒక కళాశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి మువ్వల నాగేష్ కుటుంబాన్ని పరామర్శించారు. విద్యార్థి మృతి చెంది ఇన్నేళ్లయినా ఎందుకు న్యాయం చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు దూర ప్రాంతాలకు వలస పోతుంటే వారి కోసం మత్స్యకార మంత్రి అప్పలరాజు ఆలోచన చేశారా అని అన్నారు. సోంపేట మండలంలోని ఇసుకలపాలెంలో ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైపల్లి ఈశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నీలమ్మకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వి.దుర్గారావు, దాసరి రాజు, కూన తాతారావు, గేదెల చైతన్య, మువ్వల పూర్ణచంద్ర, మువ్వల మేఘనాథ్ పాల్గొన్నారు.



పలాస : కిడ్నీ రోగులతో మాట్లాడుతున్న మనోహర్

గార్బేజ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థకు చెందిన తండేవలస డంపింగ్ యార్డులో రూ.18.76 కోట్లతో చేపట్టిన గార్బేజ్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా చెత్తను బయో రేడియేషన్, బయో మైనింగ్ ప్రాసెసింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా చెత్తను పునర్వినియోగ ప్రక్రియకు వినియోగించేందుకు వీలవుతుందన్నారు. తాను రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలోనే తండ్యాంవలస వద్ద 27 ఎకరాల్లో డంపింగ్ యార్డును నెలకొల్పినట్లు తెలిపారు. గార్బేజ్ మేనేజ్‌మెంట్ పెద్దఎత్తున కేంద్ర సహకారంతో చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని తీసుకొచ్చామని, ప్రతి వార్డులో ఒక సెక్రటరీని నియమించి పర్యవేక్షణకు నగరపాలక సంస్థ సిబ్బందిని నియమించామన్నారు. ఈ నిర్వహణ కోసమే యూజర్ ఛార్జీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమిష్టి కృషి వల్లే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచగలుగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, సర్పంచ్‌లు ఆదిత్య, కూర్మారావు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు, ఎం.తాతబాబు, కె.ఎల్ ప్రసాద్, ఎ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

బిల్లుల అప్‌లోడ్‌లో జాప్యం వద్దు

- మూడు నెలల్లో 60 లక్షల మందికి పనిదినాలు
- ఉగాది నాటికి గృహాలు ప్రారంభం
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ఆగస్టు నుంచి డిసెంబరు వరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల అప్‌లోడ్ విషయంలో జాప్యం వద్దని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మండల అధికారులకు స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద చేపడుతున్న పనులు, జల జీవన్ మిషన్, స్వచ్ఛ సంకల్పం, ఉపాధి హామీ, ప్రాధాన్యతా భవనాలు, గృహ నిర్మాణాలు, నాడు-నేడు, స్పందన తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, పలు శాఖల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు నుంచి డిసెంబరు వరకు జిజిఎంపి కింద మంజూరు చేసిన పనుల్లో 51 పనులకు చెందిన బిల్లులు ఇంతవరకు అప్‌లోడ్ కాలేదన్నారు. ఎమ్మెల్యేల నుంచి పనులకు చెందిన ప్రతిపాదనలు అందినా, అప్‌లోడ్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వచ్ఛ సంకల్పం కింద చేపట్టిన పనుల్లో పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. ఇప్పటివరకు 621 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు గానూ 513 కేంద్రాలకు చెందిన బిల్లులు మాత్రమే అప్‌లోడ్ అయ్యాయని, ఇంకా 291 కేంద్రాలు నిర్మించాల్సి ఉందన్నారు. ఉపాధి హామీలో రెండు పూటలా పని కల్పిస్తున్న ఏకైక జిల్లా మనదే అయినా లక్ష్యాల్లో వెనుకంజలో ఉన్నామని చెప్పారు. జిల్లాలో రెండు కోట్ల మందికి పనిదినాలు కల్పించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1.40 కోట్ల మందికి పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. ఈ మూడు నెలల్లో ప్రతి నెలా 20 లక్షల మందికి పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు.

ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ప్రస్తుతం 16,318 గృహాలు పూర్తి కాగా 16,712 పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆర్‌సి స్థాయిలో 7,802 గృహాలు ఉన్నందున, వాటిని ఈ నెలలో పూర్తి చేయాలన్నారు. మిగిలిన వాటిలో ఆర్.ఎల్ స్థాయిలో ఉన్నవాటిని ఫిబ్రవరి నాటికి, బి.ఎల్ స్థాయిలో ఉన్న వాటిని ఉగాది నాటికి సిద్ధం చేయాలని, ఆ దిశగా లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. స్పందన అర్జీలు పరిష్కారమైనట్లు క్షేత్రస్థాయిలో సందర్శించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో సిపిఒ వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, భూ రికార్డులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డ్వామా, హౌసింగ్ పీడీలు జి.వి చిట్టిరాజు, ఎన్.గణపతిరావు, జి.వి చిట్టిరాజు, పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నేడు డయల్ యువర్ జెసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు డయల్ యువర్ జెసి కార్యక్రమాన్ని ఈనెల మూడో తేదీన నిర్వహిస్తున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదులు, సమస్యలు తెలియజేసే రైతులు 78933 00311 మొబైల్ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు.

వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పత్రికా ప్రకటన

నా క్లయింట్ పిలక భగవాన్ S/o లేట్ పిలక కేదరి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం, మండపల్లి పోస్ట్, మునిభద్ర గ్రామం,చిరునామా. తేదీన R8178345 (27-09-2017 Govt issues date) నెంబర్ గల పాస్ పోర్ట్ ను తేదీ 21-11-2022 న 11:30 సమయం లో జెరాక్స్ కొరకు తన ప్యాంట్ వెనుక జేబులో పెట్టి తన గ్రామం మునిభద్ర నుండి ఇచ్ఛాపురం వైపు మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మార్గం మధ్యలో పోగొట్టుకున్నాడు. రూరల్ పోలీస్ స్టేషన్ కు పిర్యాదు చేయడం జరిగింది.ఈ పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికితే ఈ క్రింది నంబర్ కి ఫోన్ చేయడం గానీ రూరల్ పోలిస్ స్టేషన్ గానీ ఇవ్వవలినదిగా కోరుకుంటున్నాం.

7330983500

IN THE HON'BLE COURT OF THE III ADDL. DIST. JUDGE -CUM-JUDGE, FAMILY COURT AT SRIKAKULAM

IA414/22, IA415/22,IA416/22 IN 288/2021IN 0.S 56/2012

Between: **Vatti Veera Satya Lingam**
Petitioner / Plaintiff
And : **Vatti Veera Basava Kumar**
Respondents / Defendants
Notice Order V R-20 CPC

To
Proposed Respondents:
(37) Perisetti Gaddemma, wife of late Krishnarao, Hindu, aged 62 years, Housewife, opposite to Petrol Bunk, Main Road, Yedullavalasa Village, Polaki Mandal, Srikakulam District.
(38) Perisetti Chinnamnaidu, son of late Krishnarao, Hindu, aged 25 years, unemployee, rest do.
(40) Buduginti Swathi, wife of Mohan, daughter of late Perisetti Krishnarao, Hindu, aged 24 years, Housewife, Mettalckivalasa, Amadalavalasa Town and Mandal and Municipality, Srikakulam District.

Whereas in the above-mentioned petition in the above **suit IA288/2021 IN OS 56/2012,** the decree-holder has applied for the passing of final decree by way of partition of plaint "A" schedule described properties in to two equal shares and for ascertainment of mean profits by appointing an Advocate-comMiSSioner to conduct enquiry in that regard, as under **Order-XX Rule-12 r/w Rule-18 C.P.C.** You are hereby summoned to appear in this Court in person or through pleader on the 23rd day of January 2023, at 10 o' clock in the forenoon, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defence. Take notice that in default of your appearance on the day before mentioned court the petition will be heard and determined in your absence.

BY ORDER OF THE HON'BLE COURT
Srikakulam
09.01.2023
C. NarasimhaMurthv,
Advocate,Srikakulam
Mobile: 9440344929

క్రికెట్ ఆడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదం పడతాయని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివాని ఇంజినీరింగ్ కాలేజ్ క్రీడా మైదానంలో కళింగాంధ్ర కింగ్స్ వర్సెస్ మీడియా స్టార్స్ టీముల మధ్య 15 ఓవర్ల స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కళింగాంధ్ర కింగ్స్ టీమ్‌కు ఎంపీ, మీడియా స్టార్స్ టీమ్‌కు సీపాన రమేష్‌కుమార్ కెప్టెన్లుగా వ్యవహరించారు. తొలుత కళింగాంధ్ర కింగ్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. అనంతరం 117 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన మీడియా జట్టు 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. దీంతో కళింగాంధ్ర కింగ్స్ 30 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. శ్రీశివాని ఇంజినీరింగ్ కాలేజ్ యాజమాన్య ప్రతినిధి రాజు చేతుల మీదుగా కళింగాంధ్ర కింగ్స్ టీం కెప్టెన్ ఎంపీకి ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్నేహపూర్వక నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆహ్లాదకరంగా కొనసాగించిందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తున్నాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్, కొత్తకోట శ్రీహరి మాస్టర్, మండ దానునాయుడు, జయశంకర్, శివశంకర్, ఆదిత్య ఈవెంట్స్ అనిల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం రీజియన్ యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠ... ఉత్సాహంగా సాగింది. ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి మూడు టీమ్‌లు తలపడ్డాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు విజయాన్ని దక్కించుకుని విన్నర్‌గా నిలిచింది. శ్రీకాకుళం టీమ్ కెప్టెన్‌గా వెంకటరమణ వ్యవహరించారు. శ్రీకాకుళం జట్టు విజయంపై ఆఫీసర్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో తేజేశ్వరరావు, విజయనగరం జిల్లా ఆర్గనైజర్ ప్రవీణ్, ఉద్యోగుల సంఘం నాయకులు బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

రణస్థలం రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పిసిసి కార్య నిర్వాహక అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకొని రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయనగరం డిసిసి అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, మండల అధ్యక్షులు వై.సూర్యనారాయణ, ఎ.జగదీష్‌నాయుడు, కె.సన్యాసిరావు, బి.రాములు, జి.రాజు, పి.శ్రీనివాసరావు, ఎప.వన్, గణేష్ పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని గార మండలంలో మూడో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు చెల్లుబోయిన సూర్యనారాయణను తక్షణమే అరెస్టు చేసి ఆ నివేదికను ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు సమర్పించాలని బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో పోలీసులకు ఆదేశించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. అతనికి ఎవరు అండగా నిలిచినా వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు, తల్లిదండ్రులకు జిల్లా స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ అధికారులు పూర్తి భరోసా కల్పించాలని ఆదేశించారు.

నాటుకోళ్లు పంపిణీ

టెక్కలి రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో వెలుగు ఆధ్వర్యాన డ్వాక్రా సంఘాల సభ్యులకు సోమవారం నాటుకోళ్ల యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న నాటుకోళ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగళ్ల శంకరరావు, వైసిపి మండల అధ్యక్షులు బగాది హరి, ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, ఎపిఎం గురువెల్లి నారాయణరావు పాల్గొన్నారు.

నాటుకోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

నేడు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

బూర్జ : మండలంలోని లంకాం, మామిడివలస గ్రామాల్లో మంగళవారం రైతులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు పాలకొండ డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ పి.బాబ్జి, ఫీల్డ్ ఆఫీసర్ నాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, రుణాలు గురించి వివరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాజకీయపరంగా, పాలనాపరంగా, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పరంగా ప్రజల గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అక్కడే కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రజల మనసులో నిలిచారన్నారు. సుదీర్ఘకాలం రాష్ట్రానికి ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగేలా మనమందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామ్, గురుగుబెల్లి చలపతిరావు, సైలాడ దాసునాయుడు, సాధు చిరంజీవి, బోర చిన్నంనాయుడు, చల్లా సింహాచలం పాల్గొన్నారు.

పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న తన కార్యాలయంలో వైసిపి సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ సీనియర్ నాయకులు సువ్వరి గాంధీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పేడాడ వైకుంఠరావు, బత్తుల బుజ్జి, బగాది నేతాజి తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చిగురుపల్లి రవికుమార్, ముద్దాడ ఈశ్వరరావు, సువ్వారి వెంకటరావు, గురుగుబెల్లి గోవిందరావు, రఘు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న వైసిపి కార్యాలయంలో నాయకులు కోట గోవిందరావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో యువ నాయకులు కోట జస్వంత్, బొడ్డేపల్లి మోహన్, ఊడికల రాజబాబు, బొడ్డేపల్లి సూర్యనారాయణ, అగిస్థి జయరాం, అన్నెపు కృష్ణకాంత్, సువ్వారి నర్సింగరావు, జిమ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగన్ పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను వైసిపి నాయకులు నిర్వహించారు. మండలంలోని లొద్దపుట్టి వద్ద తులసమ్మ ఆలయం వద్ద ప్రజా సంకల్ప పాదయాత్ర విజయ స్తూపం వద్ద జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసన సభ్యులు పిరియా సాయిరాజ్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రినింగ్ అండ్ బ్యుటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, ఎంపిపి బోర పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ పాల్గొన్నారు.

రణస్థలం: ప్రజాసంకల్ప యాత్రకు నాలుగేళ్లు సందర్భంగా రణస్థలంలోని వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపిటిసి పచ్చిగుళ్ల సాయిరాం పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక వైసిపి కార్యాలయంలో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కురమాన బాలకృష్ణారావు, సర్లాన భైరాగి, వైస్ ఎంపిపిలు రేగల లక్ష్మీకాంతం, సువ్వారి వసంతకుమార్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మండల పరిషత్ ఉపాధ్యక్షులు దక్క రోజారామకృష్ణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నూక సత్యరాజు, గడ్డవలస నాగభూషణరావు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే ప్రకాశనగర్, మెయిన్‌రోడ్డు, కొత్తపేట గ్రామాల్లో పేదలకు, వృద్ధులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ

ఆమదాలవలస : కేకును కట్ చేస్తున్న స్పీకర్ సీతారాం

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న విజయ, సాయిరాజ్

సర్పంచ్ కాళ్ల సంజీవరావు, షేక్ రాజు, బొడ్డు అప్పన్న, బలగ సూర్యారావు, నేతింటి అప్పలస్వామి పాల్గొన్నారు.

నౌపడ : నౌపడలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి మేరుగు రాజేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి గోవిందు, మండల కన్వీనర్ కోత సతీష్, అప్పారావు, పొందల రామకృష్ణ, భీమారావు, రవికుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాబురావు సుధాకర్, రాములు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

దుప్పట్లు పంపిణీ

మెళియాపుట్టి: పాదయాత్ర పూర్తయి నాలుగేళ్లు సందర్భంగా 250 మంది వృద్ధులకు ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్ దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : దుప్పట్లను అందజేస్తున్న ఉదయ్‌కుమార్

ఆమదాలవలస : కేకును కట్ చేస్తున్న గాంధీ

నందిగాం : కేకును కట్ చేస్తున్న తిలక్

కోటబొమ్మాళి : రొట్టెలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ఆర్‌టిసిలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కలెక్టర శ్రీకేష్ లాఠకర్ కారుణ్య నియామకాల పత్రాలను అందజేశారు. ఈ మేరకు 12 మందికి సచివాలయ ఉద్యోగులుగా నియమిస్తూ... సోమవారం కలెక్టరేట్‌లోని వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందజేయడంతో సమర్థవంతంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి, ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట్‌రామన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి పాల్గొన్నారు.

నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నేటి నుంచి 5 గంటలకు మార్కెట్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని చీపుర్లపాడు జాతీయ రహదారి వద్ద నిర్వహిస్తున్న శ్రీపురం కూరగాయల మార్కెట్ ఉదయం 5 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎంపిటిసి బొడ్డు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున 2.30 గంటల నుంచి పెట్టడం వల్ల నిద్రమత్తులో రోడ్డు దాటడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఉదయం 5 గంటలకు మార్పు చేశామని పేర్కొన్నారు. జాతీయ రహదారికి అనుకొని ఉన్న సర్వీస్ రోడ్డుకు, బ్రిడ్జి కింద మార్కెట్ నిర్వహిస్తున్నామని అన్నారు. రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

అప్పన్న, ఎంపిటిసి

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం పోలవరం సమీపంలో ఉన్న వంశధార కాలువలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానిక మహిళలు మృతదేహాన్ని గుర్తించి పోలీసుల సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 60 ఏళ్ళు ఉంటుందని, శరీరంపై కాఫీ కలర్ ఫ్యాంట్ మాత్రమే ఉందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 63099990860 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

మృతదేహం

మాట్లాడుతున్న ఎంపిపి ప్రవీణ

పవర్ బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

దశాబ్దాల కాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్య ఇప్పటితో తీరిందని ఎంపిపి ఉంగ ప్రవీణ అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు పవర్ బోర్లను సోమవారం ప్రారంభించారు. పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి) అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొందర వీధి, హరిజన వీధి, శివాలయం కాలనీ, ఇందిరానగర్ కాలనీ, పల్లి వీధిల్లో బోర్లు, ట్యాంకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో మండలంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బాడాన పుష్ప, జెడ్‌పిటిసి మచ్చ రత్నాలు, ఎంపిటిసి తుంగాన రమణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఉప సర్పంచ్ పొందరి ఈశ్వరరావు పాల్గొన్నారు. అంతకుముందు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం సీతమ్మ తల్లి ఆలయం ఆవరణలో వైసిపి కేలండర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రణస్థలం రూరల్: ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్‌లో చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, డైరెక్టర్ తేజ ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్కూల్‌లో సంప్రదాయ పద్ధతిలో హరిదాసు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, ఎడ్లబండి, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి, సంక్రాంతి, కనుమ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. స్కూల్ ఆవరణ అంతా మామిడి ఆకులు, బంగారు పువ్వులతో అలంకరించి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్, జ్యోతి, భారతి పాల్గొన్నారు.

విద్యార్థినికి అస్వస్థత

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని అస్వస్థతకు గురైంది. బూర్జకు చెందిన ఎం.కీర్తన పదో తరగతి చదువుతుంది. రోజులానే సోమవారం పాఠశాలకు వెళ్లింది. పాఠాలు వింటున్న సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు 108కు సమాచారం అందజేశారు. వాహనం ఇఎంటి కె.శ్రీనివాసరావు, పైలెట్ సూర్యనారాయణ ప్రథమ చికిత్స అందించి అందులోనే పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణిని వివరణ కోరగా... మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఆస్పత్రికి తరలించామన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని

జాగృతి కేలండర్ ఆవిష్కరణ

సోంపేట: మండలంలోని కొర్లం పంచాయతీలో స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ జాగృతి స్వచ్ఛంద సంస్థ వార్షిక కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత ఆశయాలతో జాగృతి సంస్థను స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న రామ్ బుడ్డి గణపతి అభినందనీయులన్నారు. ఏటా సంస్థ కేలండర్లను ముద్రించి తమ సేవలను, తీపి జ్ఞాపకాలుగా చేసుకుంటున్న నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో ఇఒ వాసుదేవరావు, ఉపసర్పంచ్ తామాడ వాసుదేవరావు, తామాడ మోహన్, ముకుందరావు, పి.రాజేష్, తుంబనాథం తులసీరావ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

దూర విద్య పరీక్షలు పరిశీలన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అనే అంశాలపై పరిశీలకునిగా స్థానిక ఆదిత్యా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ డి.విష్ణుమూర్తిని ఆంధ్రా యూనివర్సిటీ నియమించింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన పరీక్షలను పరిశీలించారు.

కోడి పుంజులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోడి పందేల శిబిరంపై దాడి

కంచిలి: మండలంలోని అపురం జాతీయ రహదారికి అనుకొని ఉన్న తోటల్లో కోడిపందెలు నిర్వహిస్తున్నారన్న సమాచారంపై పోలీసులు దాడులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 17 మందిపై కేసులు నమోదు చేశారు. ఏడు కోడి పుంజులను, రూ. 2,520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటల్లో ఆదివారం రాత్రి కోడిపందెలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందెలు, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనా కేంద్రంగా 'ఐతమ్' గుర్తింపు

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు పరిశోధనా రంగంలో అత్యుత్తమ గుర్తింపు దక్కింది. జెఎన్‌టియు గురుజాడ విజయనగరం యూనివర్సిటీ ఏర్పడిన తరువాత తొలిసారిగా ఐతమ్‌కు ఈ గుర్తింపు దక్కడంతో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు జెఎన్‌యుజివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.ప్రసాదరాజు, రిజిస్ట్రార్ డాక్టర్ జి.స్వామినాయుడు, ఆరెన్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.బాబుల్ చేతుల మీదుగా గుర్తింపు పత్రాలను సోమవారం అందుకున్నారు. ఈ గుర్తింపుతో ఐతమ్‌లో ప్రస్తుతం ఉన్న సివిల్, మెకానికల్, ఇసిఇ, సిఎస్ఒ కోర్సులతో పాటు గణితశాస్త్రంలో సైతం విద్యార్థులు, అధ్యాపకులు పిహెచ్‌సిల్లో పరిశోధన చేసే అవకాశం కలిగింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచే పిహెచ్‌డికి అవసరమైన పరిశోధనలు ఐతమ్ కేంద్రంగా అభ్యర్థులు చేసుకొనే వీలు కల్పిస్తూ జెఎన్‌టియుజివి నిర్ణయం తీసుకుందన్నారు. ఇక నుంచి ఐతమ్ అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు పిహెచి చదువుకొనే అవకాశం దక్కింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస రావు, డైరెక్టర్ ఆరెన్డ్ డాక్టర్ కె.బి.మధుసాహు, డీన్లు డాక్టర్ డి.ఆజాద్, డాక్టర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ డి.విజయ్కుమార్, డాక్టర్ బి.వి.రమణ, హెచ్‌ఐడిలు డాక్టర్ యుడి ప్రసన్న, డాక్టర్ బి.రామారావు, డాక్టర్ వై.రమేష్, డాక్టర్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ పి.దినకర్, డాక్టర్ ఎం.వి.వి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పత్రాన్ని అందుకుంటున్న నాగేశ్వరరావు

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న శ్రీనివాసరావు

సమాజ సేవలో ముందుండాలి

రణస్థలం రూరల్: రైతు సేవలోనే కాక సమాజ సేవలోనూ మేము సైతం అని ముందుకు రావడం అభినందనీయమని రణస్థలం వ్యవసాయ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు అన్నారు. తలసేమియా, ఎనిమియాతో బాధపడుతున్న చిన్నారులకు సోమవారం జిల్లా కేంద్రంలో జెసిఐ స్వచ్ఛంద సంస్థ నిరాహించిన రక్తదాన శిబిరంలో విఎఎలు రవితేజ, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, సుగుణకరరావులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ మేరకు అభినందిస్తూ... ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.విజయభాస్కరరావు పాల్గొన్నారు.

ఫల్గుణరావుకు నివాళి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలో వ్యాపార వేత్త, కమ్మసిగడాం శ్రీమహాలక్ష్మి తల్లి ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి వెలిచేటి ఫల్గుణరావు మృతి తీరని లోటు అని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఫాల్గుణరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని మండల కేంద్రం మహాలక్ష్మినగర్‌లో ఆయన స్వగృహానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ఓదార్చారు. ఆయన దూరం కావడంతో ఆలయ కమిటీకి తీరని లోటని అన్నారు. ముందుగా ఫాల్గుణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అదే విధంగా ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, వ్యాపార వేత్త మేకా శ్రీనివాస్, డిజిఎం ఆనందరావు, కరిమజ్జి భాస్కరరావు, వడ్డాది శ్రీనివాసరావులూ ఫాల్గుణరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఫల్గుణరావు (ఫైల్)

యుగ పురుషుడు ఎన్‌టిఆర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగువారి కీర్తిని నలుదిక్కులా వ్యాపించేలా నటుడిగా, సామాజిక వేత్తగా, ముఖ్యమంత్రిగా ఎనలేని కృషి చేసి కీర్తి పొందిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని, అందువల్లే ఆయనను తెలుగు ప్రజలు యుగ పురుషునిగా గౌరవిస్తున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న మైదానంలో నందమూరి తారకరామా మోక్షజ్ఞ సేవా సంఘం ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ మేరకు లెజెండ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వంద మంది నందమూరి అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. న్యూబ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, తారకరామా మోక్షజ్ఞ సేవా సంఘం అధ్యక్షులు మాదారపు డేవిడ్, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, శిల్లా సురేంద్ర, సుభాష్, భాస్కర్, మోహన్ సురేష్, శ్రీనివాసరావు, గొర్లె వెంకటరమణ, సూరకాసి వెంకటరావు, కొర్ను నాగార్జునప్రతాప్, పి.ఎం.జె.బాబు, జామి భీమశంకర్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

'యువశక్తి'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

ఈ నెల 12న లావేరు మండలం తాళ్లవలసలో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ నిర్వహించనున్న యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్‌సి సెల్ విభాగం నియోజకవర్గ నాయకులు కూరాకుల యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ రాయి సునీల్‌కుమార్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం నలుమూలల నుంచి యువకులు తరలిరావాలని కోరుతూ గ్రామాల్లో ప్రచారం చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో యువతరం నిస్తేజంగా మారిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కూడా చూపించలేకపోయారని పేర్కొన్నారు. జాబ్ కేలండర్ ప్రకటన చేయడంలో వైఫల్యం చెందారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ... ప్రచారం చేపడుతున్నామని అన్నారు.

ఆమదాలవలస : ఈ నెల 12న లావేరు మండలం తాళ్లవలసలో నిర్వహించనున్న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ నిర్వహించనున్న యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. మండలంలోని గరిమెళ్లకొత్తవలసలో యువశక్తి కార్యక్రమ పోస్టర్‌ను ప్రజలతో ఆవిష్కరించారు. అనంతరం జనసేన కార్యకర్తలకు గుర్తింపు కార్డులను ప్రచారకర్త పంతం నానాజీ పంపిణీ చేశారు.

పొందూరు : యువశక్తి కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాత్రుని పాపారావు, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షర్మిలారాణి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ హయాంలో విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, టెక్కలి సబ్‌ట్రజరీ అధికారిణి భవానీ భాగ్యలక్ష్మిలను సోమవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రెండేళ్ల నుంచి టెక్కలి సబ్‌ట్రజరీ పరిధిలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో ఉన్న విశ్రాంత ఉద్యోగులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జి.వి.రెడ్డి మాస్టారు, రెయ్యి పున్నయ్య, కాపల రఘునాథరావు, బసవల అప్పలస్వామి, దల్లి వీరాస్వామిరెడ్డి, ధనుంజయరావు పాల్గొన్నారు.

పింఛను కోసం వృద్ధుడు నిరసన

ప్రజాశక్తి- పలాస

నిరసన తెలుపుతున్న సింహాద్రి

పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అంతరకుడ్డకు చెందిన కొర్రాయి సింహాద్రి చినబడాం సచివాలయం ముందు సోమవారం నిరసన తెలిపాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండుటెండలో కూర్చుని నిరసన తెలిపిన సచివాలయం ఉద్యోగులు పట్టించుకోలేదు. అనంతరం పింఛను లబ్ధిదారుడు మాట్లాడుతూ రెండు నెలలుగా పింఛను ఇవ్వకుండా తిప్పుతున్నారని ఆరోపించారు. 12 ఏళ్లుగా పింఛను వస్తుందని, రెండు నెలల నుంచి వస్తున్న పింఛను ఇవ్వకుండా సచివాలయం ఉద్యోగులు ఇబ్బందులు పెడుతున్నారరని వాపోయారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్‌ను వివరణ కోరగా, ఆయనకు వికలాంగుల పింఛను వస్తుందని, అయితే అందుకు సంబంధించి సదరం ధ్రువపత్రం అందజేస్తే ఆన్‌లైన్‌లో పెట్టి పింఛను మంజూరు చేశామని తెలిపారు.

పౌష్టికాహారాన్ని అందిస్తున్న సభ్యులు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి బి.నమ్రతాప్రియ అన్నారు. పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న గర్భిణులకు సెలైన్ ద్వారా ఐరన్ సుక్రోజ్ ఎక్కించారు. అలాగే రక్త పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులను పంపిణీ చేశారు. అనంతరం సత్యసాయి సేవా సమితి మెట్టక్కివలస వారి ఆధ్వర్యాన 60 మంది అమృత ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో సత్య సాయి సమితి కన్వీనర్ గజపతిరావు, సత్య సాయి జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్యలు, ఫార్మసిస్టు చింతాడ వరుణ్‌కుమార్, ఫాల్గుణరావు, సంతోష్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ హేమంత్, రమేష్, జి.వి.రమణ, జి.గంగాధర్, జి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ హాస్టళ్లలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు 2018లో నిర్ణయించిన కాస్మోటిక్ ఛార్జీలు రూ.40 ఇప్పటికీ విద్యార్థులకు ఇస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగు ణంగా కాస్మోటిక్ ఛార్జీలను రూ.వందకు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సన్నబియ్యం భోజనాన్ని పెట్టాలని కోరారు. అనంతపురం జిల్లాలో కెజిబివిల్లో వరసగా జరుగుతున్న సంఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పవన్, సతీష్, సాయి, రమేష్, బాబూరావు, సురేష్, అనిల్, ఉదయ్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో గడప గడపకు...

లావేరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, మాజీ ఎంపిపి డి.రాజనాయుడు, సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ, మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృపారాణి పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం వైసిపి నాయకులు చింతాడ ధర్మారావు మృతి చెందారు. ఈ మేరకు కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహనరావు సోమవారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించార. వీరితో పాటు ఎంపిపి ప్రతినిధి రోణంకి మల్లయ్య, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసి సత్యం, దివాకర్, సంపతిరావు హేమసుందరరాజు, బమ్మిడి గణపతిస్వామి, సింహాచలం, సన్యాసిరావు ఉన్నారు.

ఓటమిని ముందే అంగీకరిస్తున్న ప్రతిపక్షాలు

పోలాకి : జగన్మోహన్‌రెడ్డి గెలుపును ప్రతిపక్షాలు ముందే అంగీకరించాయని బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, పాట్నూరు సాయిప్రసాద్, ప్రతినిధి కణితి కృష్ణారావులు అన్నారు. కృష్ణారావును సోమవారం పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రెండు పార్టీలూ కలవకపోతే ఓడించడం కష్టమని వారే అంటున్నారంటే వైసిపి గెలుపును అంగీకరిస్తున్నట్లు కాదా? అని ప్రశ్నించారు. జిఒ నంబరు 1ను చదవకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు.

ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షులుగా తవిటినాయుడు

లావేరు : ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షులు గుమ్మడం ఎంపిటిసి జగ్గురోతు తవిటినాయుడును ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన సోమవారం ఎంపిటిసిల మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడులు తవిటినాయుడుకు దుశ్శాలువ కప్పి న్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, బూత్ కమిటీ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు, ఎంపిటిసిలు యినపకుర్తి సతీష్, జనపాల భానోజీరావు, దొండపాటి శివ పాల్గొన్నారు.



తవిటినాయుడును సన్మానిస్తున్న నాయకులు

పురపాలక సంఘ అభివృద్ధికి కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మానవ సముదాయం నివాసం ఉంటే ప్రదేశాల్లో చెత్తా, చెదారం వేయడానికి ప్రత్యేకమైన ఏర్పాట్ల ఆవశ్యకతను గుర్తించి, పారిశుధ్య నివారణకు సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీ 15వ వార్డు మోనంగివారి వీధిలో చెత్త సేకరణకు సంబంధించిన ఎలక్ట్రికల్ వాహన పార్కింగ్ ఏర్పాటుకు సంబంధించి రూ.37.20 లక్షల అంచనాలతో పనుల ప్రారంభోత్సవానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరింటి ముందు వారే ఖాళీ స్థలాల్లోనే చెత్త వేసేశారని అన్నారు. వర్షాకాలంలో నీటిలో కలిసి గ్రామంలో ప్రవహిస్తుండేదన్నారు. ఇందులోని సూక్ష్మక్రిములు, గాలి ద్వారా, నీటి ద్వారా, మనము తినే ఆహారం ద్వారా అంటు వ్యాధులను ప్రబలివని పేర్కొన్నారు. అలా కాకుండా చెత్తా చెదారాలను గోతిలో పూడ్చడం వల్ల దీని బారి నుంచి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ రమేష్‌కుమార్, వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బోర చిన్నంనాయుడు, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి రాజు, పొన్నాడ చిన్నారావు, సంపత్‌రావు, రామారావు, బొడ్డేపల్లి రమణమూర్తి పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

అగ్నిస్త్రం తయారీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

కషాయాలు ఉండగా రసాయనాలు దండగ అని ప్రకృతి వ్యవసాయ యాంకర్ నక్క చిరంజీవి అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన సోమవారం అగ్నిస్త్రం కషాయాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిస్త్రం కషాయాన్ని పిచికారీ చేయడంతో కాండం, కాయ తొలిచే గొంగళి పురుగులను నివారించవచ్చని తెలిపారు. ఈ కషాయం తయారీకి ఖర్చు కూడా తక్కువ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేష్, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, సూరిబాబు పాల్గొన్నారు.

అగ్నిస్త్రం కషాయాన్ని తయారు చేస్తున్న రైతులు

'పది'లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్‌జెడి జ్యోతి కుమారి

మాట్లాడుతున్న ఆర్‌జెడి జ్యోతికుమారి

ప్రజాశక్తి- పలాస

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో మెలుకువలు నేర్పించాలని విశాఖపట్నం ఆర్‌జెడి ఎం.జ్యోతికుమారి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. మండలంలోని పలాస-కాశీబుగ్గ ఉన్నత, బ్రాహ్మణతర్ల ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఎంశ్రీ పథకం కింద పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాలని, అందుకు ప్రతి మండలంలో రెండు పాఠశాలను ఎంపిక చేస్తున్నామని అన్నారు. తనకు పిఎంశ్రీ పథకం కింద శ్రీకాకుళం జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించారని చెప్పారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు. నిధులు సక్రమంగా వస్తున్నాయా? లేదా? తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు ఎంఇఒ శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చిన్నమ్మనాయుడు, తులసీరావు, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశే కీలకం

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశే కీలకమని, ఆటాపాటలతో పాటు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉన్నత స్థితికి చేరుకోగలరని ఎస్ఇబి ఎస్‌పి విజయ్ మణికంఠ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను డిగ్రీస్థాయి నుంచే నిర్దేశించుకుని లక్ష్యసాధనకు నిరంతర కృషి, పట్టుదలతో శ్రమించాలని, అప్పుడే విజయాన్ని పొందగలరని అన్నారు. తన జీవితంలో వేసుకున్న ప్రణాళికలు, సాధించిన విజయాలను వివరించారు. గ్రూప్-1, సివిల్ సర్వీసెస్ వంటి పోటీ పరీక్షలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉద్యోగావ కాశాలకు కొదవలేదని, అయితే వాటిని సాధించే సత్తా, నైపుణ్యం లేక పోవడంతో అనుకున్న లక్ష్యాలను నెరవేర్చు కోలేకపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐక్యుఎసి సమన్వయకర్త డాక్టర్ సిహెచ్.శాంతిదేవి, స్టూడెంట్ సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.ప్రదీప్, అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, సైన్స్ విభాగ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వై.పోలినాయుడు, ఆర్ట్స్ విభాగం సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎన్.చిన్నారావు, కామర్స్ విభాగం సీనియర్ అధ్యాపకులు హెచ్.లక్ష్మీపతి, కళాశాల పరిపాలన అధికారి ఎస్.సూర్యప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న విజయ్‌మణికంఠ

రూ.66 లక్షలతో మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి- లావేరు

మండల పరిషత్ సమావేశ మందిరం మందిరంలో సోమవారం ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సవరణ బడ్జెట్‌లో ఆదాయం రూ.61,14,370 కాగా, వ్యయం రూ.54,38,640లుగా పేర్కొన్నారు. మిగులు రూ.6,75,730గా వెల్లడించారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌లో రూ.66,14,470 ఆదాయం గాను, రూ.6,02,721 లను వ్యయం గాను, మిగులుగా రూ.6,11,749 లను చూపిస్తూ సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానిస్తూ ఆమోదించారు సమావేశంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు, వైస్ ఎంపిపి లుకాలాపు శ్రీనివాసరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ సునీత, సీనియర్ సహాయకులు మాధవరావు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలకృష్ణ

ఆదర్శప్రాయుడు వివేకానంద

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శప్రాయుడని శ్రీకాకుళానికి చెందిన కె.నరసింహమూర్తి అన్నారు. ఈ నెల 12న స్వామి వివకానందుని జయంతి సందర్భంగా మండలంలోని కొండములగాం, రామతీర్థాలు రోడ్డులో ఉన్న ఐరిస్ స్కూళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివేకానందుడు విశిష్టతలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు స్వామి వివేకానందుని గొప్పతనం, పట్టుదల, క్రమశిక్షణ, దేశభక్తి వంటి విషయాలు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత బోటని లెక్చరర్ దుర్గారావు, ఐరిస్ స్కూల్ చైర్మన్ కొమనాపల్లి హరికృష్ణ, డైరెక్టర్ వారణాసి రాంప్రసాద్, ప్రిన్సిపాల్ వాళ్లే తవుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు యాత్ర

మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇచ్ఛాపురం : ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ప్రజలను చైతన్యం తెచ్చేందుకు విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యాన యాత్ర నిర్వహిస్తున్నామని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమరయాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించేంత వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. పార్టీలతీతంగా చేస్తున్న ఈ సమరయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు జి.నరుసునాయుడు, కార్యదర్శి చాపర వెంకటరమణ, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు సిహెచ్.వేణుగోపాల్, ఎస్.నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కొండా శంకరరెడ్డి, కాళ్ల జయదేవ్, సంతోష పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న గోవిందరావు

మణికంఠ సన్నిధానం ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని జోగిపాడులో మణికంఠ శాశ్వత సన్నిధానాన్ని పారిశ్రామిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సహాయం కావాలన్నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యలమల గోవిందరావు, కొయిలాపు కృష్ణమాచార్య, ఆరుబోలు దశరథరావు, వాలిపల్లి వెంకటరమణ, పిండి రామారావు, వంబరవిల్లి ప్రతాప్, కోడూరు రామారావు, బిల్లింగి జీవరత్నం పాల్గొన్నారు.

ఆనందపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని ఆనందపురంలో సోమవారం పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను సర్పంచ్ ప్రతినిధి చిత్తిరి మోహన్ దగ్గర ఉండి తీయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపాల్, కోటిబాబు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాదకద్రవ్యాల బారిన పడి విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఇబి సబ్ ఇన్‌స్పెక్టర్ టి.హేమమందిర అన్నారు. మాదకద్రవ్యాల నివారణ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారినపడి తమ ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారని, వాటికి దూరంగా ఉండి మంచి భావిభారత పౌరులుగా రూపొందాలని అన్నారు. జాతీయ సేవా ప్రోగ్రాం అధికారి జలుమూరు రవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలపై మంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందరరావు, కానిస్టేబుల్ వైకుంఠరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హేమమందిర

ఆహార తయారీ కేంద్రం పరిశీలన

పర్లాకిమిడి : గజపతి జిల్లా ముఖ్య పట్టణం పర్లాకిమిడి లోని కొత్త బస్టాండ్ ఉన్న రూ.5 ఆహార తయారీ కేంద్రాన్ని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ నిర్మలాశెట్టి, కార్య నిర్వహణ అధికారి నటబర్ గరడ సోమవారం పరిశీలిం చారు. బస్టాండ్‌లో పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండడం చూసి దానిని సమతౌల్యం చేస్తామని హామీ ఇచ్చారు. బస్టాండ్‌లోని మూలమలలా పరిశుభ్రపరచి శానిటైజేషన్ చేయిస్తామని హామీనిచ్చారు. బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనం ఎదుట కొన్ని బస్సులు పూర్తి కాలం, మరి కొన్ని బస్సులు రోజులో 14 నుంచి 15 గంటలు నిలచి ఉంటున్నాయని, దానివల్ల తమ దుకాణా ల వద్దకు కొనుగోలు దారులు ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయట నుంచి వచ్చిన ఇతర వా హనాల వల్ల బస్సులు నిలపడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందలు పడుతున్నామని ఫోర్‌మెన్ రాంబాబు వాపోయారు. బస్టాండ్ ఆవరణలోలో తాగునీరు సౌకర్యం ఎక్కడా లేదని తెలిపారు. అనంతరం అన్నం తక్కువ ఇవ్వడం గమనించి నిర్వాహకులను ప్రశ్నించారు. ఆహార కేంద్రం సిబ్బంది అన్నం డస్ట్ బిన్‌లో పారబోస్తున్న కారణంగా తగ్గించి ఇస్తున్నామని, కావాల్సిన వారు అడిగితే రెండోసారి వేస్తున్నామని బదులు ఇచ్చారు.



ఆహారాన్ని పరిశీలిస్తున్న నిర్మలాశెట్టి

స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ విడి భాగాలు

నాటు తుపాకీ, తూటాలు స్వాధీనం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని గూడెం రోడ్డులో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల వద్ద లైసెన్స్ లేకుండా అక్రమంగా కలిగి ఉన్న నాటు తుపాకీ, తూటాలను స్వాధీనం చేసుకున్నామని, కానిస్టేబుల్, మరో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. మెళియాపుట్టి మండలానికి చెందిన చెందిన సవర ప్రసాద్, సవర గజపతిలు గూడెం రోడ్డులో ద్విచక్ర వాహనంపై వస్తుండగా తనిఖీ నిర్వహించామని అన్నారు. వారి వద్ద అక్రమంగా నాటు తుపాకీ ఉండడంతో వారిని విచారించామని తెలిపారు. విచారణలో స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలోని నివాసం ఉంటున్న హెడ్ కానిస్టేబుల్ కె.యుగంధర్‌గా తేలిందన్నారు. యుగంధర్ జలుమూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నాటు తుపాకీ విడిభాగాలతో పాటు 12 ఎంఎం ఖాళీ తుటాలు, లైవ్ తూటాలు కలిపి మెత్తం 36 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అక్రమంగా లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ కలిగి ఉన్న కారణంగా హెడ్ కానిస్టేబుల్‌తో పాము మరో ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నాటు తూటాలు

పంటను కాపాడాలని వినతి

టెక్కలి : టెక్కలి పంచాయతీ పరిధిలోని గోపీనాథపురం, ధర్మనీలాపురం గ్రామాల సరిహద్దులో ఉన్న పంట పొలాల్లో ఉన్న పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయని, తమ పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని సోమవారం వినతిపత్రం అందజేశారు. వంద ఎకరాలకు పైబడి వ్యవసాయం చేసుకుంటున్నామని, కానీ, అడవి పందులు తమ పొలాల్లోకి చేరి పంటను నాశనం చేస్తూ.. ధ్వంసం చేస్తున్నాయని అన్నారు. వేలాది రూపాయలు మదులుపు పెట్టి పంటలు పండిస్తున్నామని, దీనివల్ల నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో సత్తారు శ్రీనివాసరావు, దవళ రంగబాబు, బి,ధర్మారావు, వెంకటరమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

రథసప్తమి ఆహ్వాన పత్రికలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 28న నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకల్లో పాల్గొనాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారి డి.వి.వి.ప్రసాదరావు, పాలక మండలి మాజీ సభ్యులు మండవిల్లి రవి, శ్రీకూర్మం కార్యనిర్వహణాధికారి జి.గురునాథరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు అర్బన్ హౌసింగ్ అధికారి సిహెచ్.మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఇఆర్ దిలీప్ అధ్యక్షతన జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది శ్రీనివాస్, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జయశ్రీ

వంటకాల పోటీలకు స్పందన

ప్రజాశక్తి- పలాస

ఆరోగ్యకరమైన వంటకాలు చేయడంలో మహిళలు ముందుంటారని పలాస లయన్స్‌క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత అధ్యక్షులు మల్లా జయశ్రీ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు సోమవారం లయన్స్‌క్లబ్‌లో వంటలు పోటీలు నిర్వహించారు. ఈ మేరకు 30 మంది మహిళాలు పాల్గొని రుచికరమైన వంటలను వండారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడమే కాకుండా కుటుంబానికి ఆరోగ్యకరమైన రుచికరమైన వంటకాలు చేసి పెడుతున్నారని అన్నారు. అనంతరం గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలైన తంగుడు జ్యోతి, అంధవరపు నీలిమ, తంగుడు స్వాతిలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తర్లానా శ్వేతకుమారి పాల్గొన్నారు.